

వేలూరి శివరామశాస్త్రిగారు

౧

తిరుమలాచార్యులు గుంటూరు కాలేజిలో తప్పి కలకత్తా-బ్రహ్మసమాజ-కాలేజిలో ప్రవేశించెను. వెంటనే తిరుమలరాయ్ అని పేరు మార్చివేసెను.

దీనికి రెండు హేతువులు: ఒకటి— కలకత్తాలో అందఱు రాయిలే; రెండవ హేతువు కొంచెము లోఁతు—ఆంధ్రవైష్ణవులలో చాలమంది నియోగులే [వైదికులును లేకపోలేదు.] తనది వైష్ణవము పుచ్చికొన్న నియోగికుటుంబము; ఆమూలమన్వేషించి 'ఆచార్యులు' తీసి 'రాయి' పెట్టుకొనెను. రాయి రావులు ఏకోదరములు; లేక రావే రాయి.

కలకత్తాలో తిరుమలరాయి పొట్టిపేరు రాయి. ఇంటికడ ఆచార్లు.

వాదములందు అతఁడు ఇష్టసాహసుఁడు. సహాధ్యాయుల సమ్మేళనములందు రాయి ఆస్తికులతోపాటు నాస్తికులనూ ఖండించెను. క్రీస్తుమతమును ఏకి బ్రాహ్మమతమును సాకలేదు. మత మనునది అతనిపాలిట మూఢవిశ్వాసము. దానిగుఱించి యెంత వాదించినను వాగ్వ్యయము కాదు. అతఁడు సేశ్వరవాదియో, నిరీశ్వరవాదియో, అగ్నాస్టో (Agnosto) ఇంతవఱకు ఎవరికిని తెలియలేదు.

అతఁ డపుడపుడు సాంఘికధర్మముల గుఱించి తనజట్టునకు చెప్పుచు వచ్చెను. 'వివాహవిధి మనుష్యుఁడు విధించుకొనిన క్రూరనరకము. ప్రేమ చలము; ఏకమాత్రనిష్ఠము కాదు' అని.

అతనివాదముల కబ్బురపడి చాలమంది అనుయాయులై అతనిని తమకు నాయకునిగా అంగీకరించిరి. కొందఱు అతఁ డిరువదవ శతాబ్దికి మూలపురుషుఁడును, మతకర్తయును కాఁగలఁడని తమ దూరదృష్టితో చూచిరి.

అతఁడు వాదములలో శరప్రయోగము చేసెనా లక్ష్యమును వేధించి తీఱును. అతఁడు జ్ఞానివలె తలయెత్తుకొని తిరిగెను. రాజువలె ఆత్మగౌరవము రక్షించుకొనెను. దేశనాయకునివలె పలుమందిని చెప్పుచేఁతలలో ఆకట్టెను. అన్నిఁటికంటె తనకు ప్రకృతమైన చదువులో మొదటివాఁడుగా నిలుచుండెను.

సెలవులలో రాయి స్వగ్రామమునకు వచ్చి ఆచార్లుగా మాఱెను. వారిగ్రామమంత

పల్లియగాదు; బస్తీయుఁ గాదు. హోటలు లేదు కాని కాఫిహోటలు కలదు. స్కూలు ఫైనలు తప్పినవారు దానికింది క్లాసులు తప్పిన వారితోపాటు పలువురు; బ్రాందిషాపుతోపాటు సోడాషాపు. రోడ్డు ఊరినడుమ లేదు కాని అంటుకొని పోవును. కోర్టు లేదు కాని పంచాయతీకోర్టు. తగవులతోపాటు తీర్పులు హెచ్చు. దినుసుల వెల యిబ్బడి. అలికిజనము మిక్కుటము. క్రొత్తగా వెలసి పాడుపడిన వడ్లమరల రేకుపాకలు. దాపున కాలువ. ఇట్టి ఈగ్రామమునకు ఆచార్లు టెన్నిసుకోర్టుతో ఒక క్రొత్తశోభ కలిగించెను. చుట్టుపక్కల యిండ్ల ఆఁడువారు ఆడువారిని పసపాటలు కూడ మానుకొని చూచుచుండిరి. వారిలో ముఖ్యముగా ఆబంగాళా బాబును.

ఆచార్లతల్లి మూఁడుకాళ్ల ముసలి. ఆమె తనకొడుకు ఇంచుమించుగా ఇండియా నేలు ననుకొనును. అతని కెదురాడదు. సలహా చెప్పుటకుఁగూడ జంకును. అన్నమునకు తొందరపెట్టదు. ఒకనాఁ డతఁడు టెన్నిసు సన్నాహముమీఁద నుండఁగా ఆతొందరలో తన అధికారము బయటఁబడ దనుకొని—నాయనా, నీపెండ్లి కనులారఁ జూచుకొని మరి మరణింపవలెనని నాకోరిక అనెను.

'అమ్మా! నాపొట్ట పోసికొనుట నేను నేర్చికొననిదే ఇంకొక పొట్టనుగూడ నేల తెచ్చికొనవలయును?'

'ఏమినాయనా, రంగనాథుని అనుగ్రహమువల్ల గ్రాసవాసోదైన్యము లేదు. నీవు ఉద్యోగము చేయఁదలఁచినచో గానేరుకావా? నాకన్ను లున్నందులకు ఏమిఃఫలము?'

'అమ్మా, గవర్నరే? పోరపాటు పోరపాటు. ఈకాలమున రెవిన్యూ ఇన్‌స్పెక్టరు కూడ కాలేను. దేవుని డబ్బు తినుటకా యిఁక? ఆఁడుది కూర్చుండి తినలేదూ? పరీక్షలు నెలలో తేలును. వెంటనే కోడలిని నీకు చూపింతును.'

'మానాయన మానాయన! కానీ తొందరగా కానీ!'

౨

టెన్నిసు

టెన్నిసు ఆడువా రందఱు ఆచార్లకింద తయారయి ఆచార్యుని మించినవారే.

నాఁడు బంతి అందించు బాలసేవకులు రాలేదు. ఆటతమకమున ఎవరిబంతి వారే తెచ్చికొనుచుండిరి.

ఆబంతులలో ఒకబంతియందు ఆచార్లకు కడుఁ బ్రీతి. అది మాయామృగమువలె చెంగు చెంగున దుమికి పక్క గుడిసెకడఁ బడెను. మెఱుపువలె మెఱసి ఒకమనిషి* దానిఁ దీసి లోని కేఁగెను.

ఆచార్లు రెం డడుగులు వైచి తల యెత్తి చూచి వెనుదిరిగెను. మఱియొకబంతితో ఆట సాగెను.

అటుతరువాత ఆచార్లే ప్రతియాటయు ఓడెను. తనమీఁదఁ బడకుండ కొన్ని బంతులను చేతితోఁ గొట్టి తప్పించుకొనెను. మీఁదఁ బడిన కొన్ని బంతుల నెఱుఁగనే యెఱుఁగఁడు.

సూర్యుఁడను బంతి విధిచే నేలకుఁ గొట్టఁబడెను. అది అస్తాద్రి గుహాగృహము దూరెను.

వల, బంతులు, బాటులు జాగ్రత్తపెట్టించుటకు ఆచార్లు క్రీడాక్షేత్రముననుండెను. మిగిలినవా రందఱు విసిరికొట్టిన బంతులవలె పాఱిపోయిరి.

ఆచార్లు గుడిసెవైపునకు అడుగులు వైచుచుండెను. మెఱుఁగుఁ దీఁగవంటి యొక జవ్వని తొంగితొంగి చూచి లోపలికి లోపలి కొక్కొక యడుగే వేయుచుండెను. ఆచార్లు గుమ్మము చుట్టుపక్కల చూచెను. ఎవరును లేరు. చేతులు ద్వారమునకు ఆనించి మోము లోపలఁ బెట్టి చూచెను. ఎవరును లేరు. లోపలికి వెళ్లెను. మర్గము దారపుఁగండెలు తక్క నెవరును లేరు. గదిగుమ్మములో తలపెట్టి చూచెను. ఎవరునులేరు. లోనికివెళ్లెను. మూల ఒక జీవత్ప్రతిమ నిలువఁబడియుండెను. అతఁడు 'నాబంతి యేది ?' అని అడిగెను.



ఆజీవత్ ప్రతిమ 'నా కేమి తెలియును?' అని పైఁట సవరించుకొనెను. సవరణయొక్క ఉద్దేశము నెఱవేఱెను.

ఆచార్లు నాబంతి నా కిమ్మనెను. అది యీయఁబడలేదు కాని మరికొంచె మెక్కువ భద్రపఱుపఁబడెను.

---

* మగ-యాడు-భేదము తెలియని వ్యక్తి వాచిగా ఈపదము వాడుకలో నున్నది.

ఆచార్లు కొంచెముసే పదేపదిగా చూచెను. సమీపించి పైటలోని బంతిని మృదువు మృదువుగా లాగికొనెను. పైట క్రమ్మఱ గ్రమ్మఱ సవరించుకొనఁబడుటచే కిందఁ బడునట్లు కానిపించియు లోనికే పోయెను. అతఁడు నేర్పుగా తీయఁజూచెను. తీయఁబడు లోపుగా అది ఆకాశమున కెగిరి అటకమీఁద అటికలో కూర్చుండెను దానితో ఒక కొత్త బంతియాట మొదలాయెను.

దానిపేరు 'రంగి. రంగిని రంగమ్మ యనియో రంగనాయిక యనియో వ్యవహరించుచో దానికి కొత్త లావణ్యము రాదు. పేరులో ఏమున్నదని షేక్స్పియరుకూడ అన్నాఁడు. కాని రంగికి బదులు రంగనాయిక యన్నచో పదమునకు ఉన్న లావణ్యమూఁడదు. కవి నిరంకుశుఁడై తన్నెక్కడ దుర్వినియోగము చేసిపోవునో యని ఒకానొకపుడు పదములు కూడ భయపడుట కలదు.

లోకులు దాని రంగి యందురుగాక! ఇచట రంగనాయిక. అసలు దానిపే రదియే నేమో! నామకరణము సుబ్బమ్మ. వాడుకలో సుబ్బి.

ఆచార్లు 'నీ పేరేమి?' అని అడిగెను. రంగనాయిక 'నాపేరు రంగి—నాపేరు-రంగ' అనఁబోవుచుండఁగా అతఁడు-'కాదు, నేనొకపేరు పెట్టుదును, 'కందుకావతి' అని, 'కందుకావతీ!' అని పిలిచెను. 'ఏమి?' అని ప్రత్యుత్తరము వచ్చెను. ఇరువురును నవ్వుకొనిరి.

కందుకావతి 'నీ కొక పేరు నేనును పెట్టెద' ననెను. ఆచార్లు 'ఏమిపే'రని అడిగెను. కందుకావతి-'రంగనాథుఁడు' అనెను. ఆచార్లు 'నీ వీ పేరు పెట్టినందులకు బదులు నేను ముద్దు పెట్టెద' ననెను.

కందుకావతి వెనుక వెనుక కొదిగి తల్పమున కానుకొనఁగా ఆచార్లు ముందు ముందులకుఁ జని కవ్వించి ముద్దాడెను.

వాకిట దగ్గు.

విని రంగనాథుఁడు త్రుళ్లిపడెను. కందుకావతి లోలోన నవ్వుకొనుచుండఁగా రంగనాథుఁడు వెలుపలికి వెళ్లెను. జబ్బుతో తీసికొనుచున్న నరసింహులు —— 'ఏమి బాబూ, మాయిల్లు పుణ్యక్షేత్రము చేసితిరి!' అనఁగా

ఆచార్లు—‘నాబంతి మీయింటఁ బడినది, అందులకు వచ్చితిని’ అనెను.

‘దొరికినదా? ఏదీ?’

‘లేదు. అటకమీఁద పడినదఁట.’

‘ఓసీ బాబుగారికి తీసియిమ్ము’

‘ఇపుడు పనిమీఁద ఉన్నాను; రేపు తీసియిచ్చెదను.’

3

మఱునాఁడు బంతికొఱకు ఆచార్లు కందుకావతి యింట నుండెను.

‘పెండ్లి యాడనని ప్రతిజ్ఞ చేయుము.’

‘అంకు సాగుచో పెండ్లి యేల?’

‘జాగ్రత్త జాగ్రత్త! అంకా? అంకా? నామాట బొంకని తోఁచుచో నిన్నటి ముద్దులతోనే ఆఖరు. ఐనను నీవు నాకు పతివి-పరిత్యక్త పతివి. మరల వినుము. నాఁటికి నా తలిదండ్రులు చచ్చి నెల. నరసింహులు నా మేనత్తకొడుకు. త్రాగుబోతు. నే నొకనాఁడు నిద్రపోవుచుంటిని. కలలోవలె కొంత యేమో వినఁబడెను. లేచి చూచితిని. పక్కన పురోహితుఁడు. నామీఁద పసపు బట్ట. మెడలో తాళి. తాళి తెంపి పురోహితుని కాళ్లకు కట్టితిని. నన్ను పట్టుకొని పలువురు మరల కట్టిరి. తెంపిపోసి మన్యములలోనికి పాఱిపోతిని. వాఁడు నరసింహులు వెదుకుచు వచ్చెను. వచ్చిననాఁడే జ్వరమునకు బలి యాయెను. నేఁటికిని అదియే జ్వరము. పాపఫలము వెంటనే కానిపించెను. వాఁ డిపుడు నా పోషణలో ఉన్నాఁడు. వింటివా? దాన జేసియే నాకు వాఁడన్న భీతిలేదు. ప్రత్యుత నేనన్న వానికి భీతి. నిన్న నీవు తొట్రిలి వాకిటికి పరువెత్తితివి. నీకు వెనుకగూడ కన్నులు కలుగుచో అపుడు నా నవ్వు చూచియుందువు. వింటివా? పోనీ నరసింహులనే అడిగిచూడుము. లేక నేనే నీముం దడిగెదను.’

ఆచార్లు ఆలోచించి ఆలోచించి పలుమాఱులు సమాధానము చెప్పవచ్చియు ఆఁగిపోయెను.

కందుకావతి—‘తొందర లేదు. ఆలోచించుకొనుము’ అనెను.

‘నాకొంప తవ్వుటకు ఎవరా యాలోచన?’ అని వాకిలి పలికెను.

ఆచార్లు లేచెను. కందుకావతి నవ్వెను. నవ్వి చేయి పట్టుకొని కూర్చుండఁబెట్టెను. నరసింహులు లోనికి వచ్చి—‘తమరా బాబయ్యా! ఎఱుఁగక అంటిని. అయ్యా! తమబంతి యింకను దొరకలేదా? అవును దొరకదు; అవును దొరక’ దనెను.

కందుకావతి నరసింహులకేసి ఒకచూపు చూచెను. జ్వరమునకుఁగూడ నతఁ డంత కంపింపలేదు.

ఆచార్లు అటక యెక్కి బంతి తీసి కిందఁ బడవైచెను. కందుకావతి చేకొనెను. ఆచార్లు దిగి రాఁగనే బంతిచూపి కందుకావతి మరల దాని నటకమీఁద వైచెను.

ఆచార్లు చేగడియారమున నాలుగు గంటలు చూచి టెన్నిసురంగమున సహచరుల కెదురు చూచెను.



"కందుకావతి నరసింహులకేసి......అత డంత కంపింపలేదు."

నాఁడుకూడ ప్రతియాటయు తానే ఓడెను. ఆచార్యు లనాచార్యులాయెనని సహచరులు గేలిచేసిరి. నవ్వుచు అతఁ డింటికేఁగెను. క్రమక్రమముగా అంధకార మావరించెను.

నడికిరేయి అనుకోకుండ కందుకావతికి కన్నులపండు వాయెను. కందుకావతి ఆచార్లను కూర్చుండఁ బెట్టెను.

'ఆలోచన అంతమాయెనా?'

'ఆహా!'

'నీపేరు.'

'రంగనాథుఁడు.'

'నిక్కమే?'

'ముమ్మాటికి.'

కందుకావతి మగ్గమునుండి మూఁడుతంతువులు తెచ్చి పసుపురాచి అతని మెడలో వైచెను. రంగనాథుఁడు పసుపు కొమ్మొకటి వెదకి తెచ్చి దారమునకుఁ గట్టి కందుకావతి మెడలోఁ గట్టెను. కట్టినతరువాత 'లోఁగడ నామాటయు ఇప్పటి ఈ చేఁతయు సరిగాలే' వనుకొనెను. కందుకావతి తలుపులు మూసెను.

౪

తిరునాంచారమ్మ పను లన్నియు తీర్చుకొని తీరికగా కూర్చుండెను. ఆమె వీథిలోనికి వెళ్లనున్న కుమారునితో 'నాయనా! పెండ్లిమాట యేమి?' అనెను.

'ఉండవమ్మా! ఇఁక నెలలో పరీక్షలు తేలును. తేలిన వెనువెంటనే నీకాలిముందు కోడలు.'

'కాదు నాయనా! నేను మంచిసంబంధము విచారించితిని. వారు నిరుపేదలు. పిల్లను చిదిమి దీపము పెట్టవచ్చును. చదువుల సరస్వతి. నేనిఁక పనిపాటలకు పనికిరాను. మగఁడు లేని ఆపిల్ల అక్కయు, తల్లియు నా చేతి కక్కఱకువత్తురు.

'ఏమిా ? ఆపిల్లఅక్కా ? ఆహా! నే నెఱుఁగుదును. సరిలే. ఆలోచింపుము.'

'వేయేండ్లు వర్ధిల్లు నాయనా వేయేండ్లు వర్ధిల్లు! బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా పనికిరారు.'

ఆచార్లు లోలోపల 'అక్కా? అక్కా? అనుకొనుచు అతిథిపనిమీఁద వెళ్లిపోయెను. తిరునాంచారమ్మ తొండరడిప్పొడియాళ్వారు పాట పాడుకొనుచు గుమ్మములో కూరుచుండెను. పొరుగింటి కోయిలకుంట పున్నయ్య తిరునాంచారమ్మతో కాలక్షేపమునకువచ్చెను.

'ఏమి నాయనా! భోజనము లయినవా?'

'అయినవి కాని ఏమిపాట' అది ?

'తొండరడిప్పొడియాళ్వారుపాట.'

'అబ్బ! మధ్య వైష్ణవమునకు నామములు పెద్ద! విప్రనారాయణచరిత్ర మనరాదూ ?'

'పోనీ! ఔను నాయనా!'

'తగినదే పాట !'

'ఏమి నాయనా ?'

'తగినదే అంటెనిగా తగినదే.'

'అనఁగా ?'

'మనవాఁడూ ....మనవాఁడు — ఇపుడు విప్రనారాయణుఁడే. పోనీ! మీా అఱవ మాటలో ఏదీ? ఆపొడి! ముక్కుపొడి! తొండరడిప్పొడి !'

'అదియేమి నాయనా? మాఁవాఁడు పరీక్ష తేలఁగనే పెండ్లాడును. పిల్ల తెలియునా?'

'అంత సాగుచో పెండ్లి ఎందులకవ్వా ?'

'మానాయన అనినచో గిట్టనివాళ్లు అట్లు చెప్పుదురు.'

'అతనికి పెండ్లి, శోభనము ఒకపర్యాయమే అయిపోయినవి.'

'కాలేదు నాయనా, గిట్టనివాళ్లెవరు చెప్పిరి నీకు?'

'అవ్వా, ఈకాలపువారి పెండ్లిండ్లిఁక ఈ విధముగనే జరుగును. కులగోత్రములతో పనిలేదు. బాజాబజంత్రీలు వలదు. మంగళసూత్రముల మాట లేదు. కోర్టులలో పేరులు రిజష్టరు అగును. తీఱిపోవును.'

'కాదు నాయనా, ఏలోకపుమాట లివి? మా నాయనకు ముహూర్తము కూడ పెట్టించితిని. అద్వైతులకుఁగూడ విందు లేర్పాటు చేసితిని. నీవు రావలయుఁ జుమీా! గిట్టనిమాట లెందుకు?'

'గిట్టనిమాట లేమిటమ్మా! నేను నా కనులతో చూడఁగా?'

'నీకనుల కేదో జబ్బు! రెండురోజులు చనుబాలు పోయించుకో! మానాయన అటువంటివాఁడు కాఁడు. కాఁడంటే కాఁడు.నమ్ము.'

ఇటులు వారు మాటలాడుకొనుచుండఁగా ప్రతివాదిభయంకరం రంగాచార్యులు ఉబుసుపోక అవ్వతో నవ్వవచ్చెను.

పున్నయ్య—'అవ్వా! నామాట నమ్మనిచో మీా రంగణ్ణి అడుగుము!' అనెను.

రంగ—'ఏమది ?'

తిరు—'ఏమిలేదు ఏమిలేదు ఎందుకు వేళాకోళము ?'

పున్న—'మన తిరుమలయ్య ముచ్చట.'

రంగ—'అవ్వా! ధన్యురాలవు! అఱపైస కర్చులేక అఁబెయ్యయంత కోడలు. మీరిఁక బట్టలు కొన నక్కఱ లేదు. శుద్ధ స్వదేశీ-స్వగ్రామ-స్వచేతి-ముతకగుడ్డలు.'

తిరు—'ఏమిటి బాబూ! మీ వందలవి గిట్టనిమాటలు! మీరెన్నియేని అనుఁడు. మా వాఁడటువంటివాఁడు మాత్రము కాఁడు.' అని లోనికిఁ బోయి తలుపులు మూసికొనెను.

'అగుచో మీవాఁ డిపు డేచట' అని బయటినుండి వినఁబడెను.

'ఏమో! ఏపనిమీఁద బయటికి వెళ్లినాఁడో! గిట్టని మాటలు నాకేల ?' అనుకొనుచు ఆమె పాశరములు పాడఁదొడఁగెను.

౫

(౧)

ఇంటర్మీడియేట్ పరీక్షలలో జయము నొందినవారి పేరులు ప్రకటింపఁబడెను. తిరుమలరాయ్ పేరు మునిమొదట.

ఆచార్లు టెన్నిసు సహచరులకును, ఇతరులకును ఫలాహారము లొసఁగెను. అందఱును చదువులో అప్రతిముఁడ వని అతని కీర్తించిరి. టెన్నిసు సహచరులు 'కందుకప్రియ' 'టెన్నిసురంగనాథ' అనుబిరుదు లిచ్చిరి.

నాఁడు అతనితల్లి పులిహోర, వడలు, ఇడ్లు లోనగు పిండివంటకములును, తంగళి కరియామధు లోనగు పచ్చళ్లును చేసెను. తిరువారాధన చేయించెను.

సాయంకాలమున చాటుగా వచ్చి నరసింహులు పదిరూకలుబహుమతి గొనిపోయెను.

నాఁడు క్రీడాక్షేత్ర మంతయు విజయవీరనాదములచే మాఱు మ్రోఁగెను. జయమందు పట్టుదల యెవరికిని లేదు. ఎవరియిష్టము చొప్పున వా రాడిరి. ఒకఁ డాకాశమునకు, ఒకఁడు నేలకు, ఒకఁడు దిగంతములకు బంతిని కొట్టెను. ఆచార్లు తనకు చిక్కిన బంతుల నన్నింటిని నేర్పుతో కందుకావతి యింటిలోనికే కొట్టెను. అందఱును—'దీనిభావమేమి తిరుమలేశ?' అని పాడిరి. పాడిన ప్రతివానిమీఁదను 'దీనిభావమిది' అని బంతిచే ఆచార్లు సమాధానము చెప్పించెను. చీకటిపడెను.

(౨)

ఆచార్లు తనయింట బంతులు వైచుట కెంత యుల్లాసము చెందెనో కందుకావతి అంతచింత జెందెను. 'ప్రేమ ఔచితి నెఱుఁగదా? లేక పాత్రనుబట్టి ఔచిత్యమా? ఔను. పెండ్లియాడిన దానితో ఎవఁడేని యిట్టి సరసము చేయునా? చేసినను దాని యందము వేఱు' అనుకొని ముకుళించెను.

నరసింహులు పదిరూపాయలతో కుబేరుఁడై కల్లంగడికి పోయెను. తాగెను, తాగించెను. తినెను, తినిపించెను.

బ్రాంది షాపునకు వెళ్లెను. తాగెను తాగినంత పోయించెను. ఒకసీసా బట్టచాటున బెట్టుకొని ఇంటికి వచ్చెను. మంచము మీఁద కూర్చుండి సంగీతములు తీసెను. 'రంగీ' యని పలుమాఱు లఱచెను. 'రంగీ! ఏల దుఃఖము? ఏల కన్నీరు? జగతియంతయు ఆనందము. ఆనందింపుము, సుఖింపుము, క్రీడింపుము!' అని యని మగతలో పడెను. పోయెను నరకమునకో లేక స్వర్గమునకో!

(3)

రాత్రి పదిగంటలకు కందుకావతి తలుపు మీఁద చప్పుడు. విని కందుకావతి ఊరకుండెను. నరసింహులు లేచి—'ఏల ఊరకున్నది? మతిమాఱెనా?' అనుకొని మరలకునికిపాటులు పడెను.

తలుపుమీఁద మరల మ్రోఁత. కందుకావతి తలుపుతీసెను. ఆచార్లు గదిలోనికి వెళ్లెను. కందుకావతియు.

ఆచార్లు 'ఇవిగో నీకు కానుకలు!' అని కొన్ని ఆభరణములను వలువలను దీసి బల్లపైఁ బెట్టెను.

కందుకావతి—'తమరు పరీక్షలో ముని మొదట జయమందుటయే నాకు అన్ని కానుకలును. నాకేమి ఈ బహుమతు లేమి? కన్నవారును విన్నవారును నవ్వరా?' అనెను.

'నీవు వీని నిపుడు ధరింపవలెను.'

'అటులనవలదు. నా కొక ప్రతిజ్ఞ కలదు. అది చెల్లువఱకు తాల్పను. కానిచో మీ దయచే లోఁగడనే బంగారుపిచ్చుకను గానా?'

'ఏ మా ప్రతిజ్ఞ?'

చెప్పెను.

'పోనీ తీసి దాఁచికొనుము.'

'మాయిల్లు మీ రెఱుఁగనిది కాదు. పొరుగింట దాఁచిరానా?'

'మంచిది.'

కందుకావతి తిరునాంచారమ్మను లేపెను. 'మీ అబ్బాయికి సంబంధము కుదిరెనా?' అని అడిగెను. 'కుదిరె' నను ప్రత్యుత్తరము విని—'తమకొడుకు పిల్లకు నగలు చేయించెను; మీ కిమ్మని నాచే పంపెను' అని యిచ్చెను. తీసికొని తిరునాంచారమ్మ తలుపులు మూసికొనెను.

ఆచార్లు ఆనందముతో శయ్య సవరించుకొని పడుకొని దిగి మరల సవరించుకొని పడుకొనెను. తల యెత్తి దిండ్లు సరిగా పెట్టుకొనెను. లేచి మరల దిండ్లను సరిచేసికొని శయనించెను.

కందుకావతి తలుపులు మూసెను. ఆచార్లది దొంగనిద్ర కాదు. ఊరకయే కనులు మూసికొనెను.

'అపుడే నిదురయా?'

'ఈ రేయి యంతయు లేదు నిదుర.'

ఈమాట విని నరసింహులు లేచి కూర్చుండెను. అతనికిని లేదు నిదుర.

సుఖపారవశ్యముచే కొందఱకు నిదుర రాదు. దుఃఖపారవశ్యముచే కొందఱకు రాదు. కర్మకు సుఖదుఃఖములే కందుకఖేల.

లోపల పరిహాసములు పాటలు; బయట బండుబూతులు రోదనములు. లోపల వలపు పలుకులు వాటపు ముద్దులు; బయట తల యూఁపులు దంతనిష్పీడనములు. లోపల పరిమళ నిశ్వాసములు ప్రేమశపథములు; బయట వేఁడి యూర్పులు కోపశపథములు. లోపల కాలజ్ఞానము లేదు; బయటను లేదు.

కొక్కొ-రోకో. నరసింహులు త్రుళ్లిపడి బ్రాందిసీసా యెత్తి గడగడ తాగెను. కర్రతీసికొని గదిగుమ్మము కాచెను.

(౭)

కొంతవడికి తలుపులు విడివడెను. చెట్టాపట్టాలు పట్టుకొని ఇరువురును వచ్చిరి. ఆచార్ల తలపైమృత్యుదండమువలెనరసింహుల దండము పడెను. కందుకావతి ఆచార్ల తలవంచి తనతల అడ్డుపెట్టెను. తల పక్కనపగిలెను. మరలఎత్తిన కర్రవెంట రక్తముకాఱి నరసింహుల తలతడిసెను. కందుకావతి మరల ఆచార్లతలమీఁదఁ బడనున్న కర్రను లాగఁకొనెను.

ఆచార్లు తెల్లబోయెను. నరసింహుల నొక్కత్రోపు త్రోసెను. అతఁడు గోడపైఁబడెను. ఆచార్లు గొంతుక పిసుకఁబోయెను.

'కందుకావతి—చంపకుము.'

'ఛీ చంపెదను.'

'చంపకుము. ఇది ఆజ్ఞ'

'ఆజ్ఞయా?నీయాజ్ఞ! చంపెదను.'

'చంపఁదలచిన నేను చంపలేకపోతినా? చంపకుము. చంపితివా ?'

'ఏమి ? చంపిన? నీవు చూచుచుండఁగా చంపిన ? ఏమి చేయుదువు ?'

'ఛీ చంపకు! నాకు స్మృతి పోవుచున్నది లేకున్న నిన్ను నెట్టివైచియుందును.'

ఆచార్లు నరసింహులను మరల త్రోసెను. మరొకగోడపై బడెను. మరల త్రోసెను. కందుకావతి కూలఁబడి వారించెను. వారించిన కొలఁది త్రోసెను. అతఁడు మంచముపైఁ బడెను. తల మంచపు కోడుమీఁద. ఆచార్లు రెండుచేతు లెత్తికొట్టెను. రక్తము చూచి వదలెను.

కందుకావతి 'నీవిచట ఒక నిమిషమేని ఉండవలదు పొమ్ము పో' మ్మనెను. ఆచార్లు 'వెళ్ల' ననెను.

'ఇఁక నా మొగము చూడఁజాలవు.'

యోజించి ఆచార్లు వెళ్ళిపోయెను.

(౫)

క్రమముగా కందుకావతి ఎఱుక బాసెను. రెండుతలలనుండి రక్తము మాత్రము జాగరిల్లెను.

వారును వీరును పోగయిరి. శాంతిని భంగింప పోలీసులు వచ్చిరి. ఆసుపత్రి డాక్టరు. అతనితో నరసింహులకు ప్రకృతము పని లేక పోయెను. కందుకావతికి క్రమముగా తెలివి కలిగెను. పోలీసుల ఆర్భాటము హెచ్చెను. కందుకావతి అచట వారి కేసు చెప్పను తిరస్కరించెను.

పోలీసు కేసు. నరసింహులు తప్ప తాగి వచ్చి తనను కఱ్ఱతో మోఁదె ననియు, తాను తోయఁగా మంచపుకోటికి వానితల కొట్టుకొనె ననియు, పిదప స్మృతితప్పి పడిపోతిననియు కందుకావతి చెప్పెను. ప్లీడరు ఆచార్లమాట తేఁగా 'స్త్రీలమర్యాద కోర్టువారు కాఁపాడవలె' ననెను.

పోలీసువారు ఆచార్లవద్ద పదివేలుమాత్రము వదలించిరి.

ప్రమాదవశమున ఈనేరము జరిగె ననియు, తనప్రాణరక్షణకు కందుకావతి తోసె ననియు, 'దాన తల ఆనుషంగికముగా కోటికి కొట్టుకొనె ననియు' దానిని పోస్టుమార్టమ్ నిర్ధారించెననియు, శిక్షతగ్గించి రంగనాయికకు మూఁడేండ్ల ఆరునెలల విడికైదు కోర్టువారు విధించిరి.

౬

కందుకావతికి కోర్టు శిక్ష విధించెను. సంఘము ఆచార్లను వెలివేసెను.

న్యాయదండమునకు లోకుల అనుకంప కలదు. తన శోకవిధముగా మనశ్శాంతియు కలదు.

వెలి సంఘము విధించిన దండము. వెలియను ఉచ్చును ఎవరును జాఱఁదీయరు; ప్రత్యుత బిగింతురు. అది మశూచి మచ్చ; అంటురోగము; శిరోజాడ్యము.

కందుకావతి ఆచార్లకు బదులు తాను శిక్ష పడెను. నీరవముగా భరించెను. ఆచార్లు తనదోషమునకే తాను వెలిపడెను. అది అతనికి హృద్రోగము. సంఘముమీఁద పండ్లు పటపట గొఱికెను. అందఱకు సంబంధించిన పిల్లను జేసికొని సంఘమును పాదాక్రాంతము చేసికొన నూహించెను.

చెఱసాలలో కందుకావతికి అందఱును చుట్టములే. జైలుసూపర్నెంటు కందుకావతిని నూలుపనిమీఁద మేస్త్రీగా నియమించెను. కందుకావతి యనిన అందఱకు అతి మర్యాద.

ఆచార్లయింటికి ఎవరును రారు. అతనిని ఎవరును భోజనమునకు పిలువరు. టెన్నిసుకోర్టుకూడ అతనికి మన్నా. అతఁడు అందఱను ద్వేషించెను. తనవాచాలత నుపయోగించి ఒకజట్టు లేవఁదీయుట కిది కలకత్తా కాదు. చేయఁదగిన దేదియు లేదు. సంఘముమీఁద కసి. దీనిపునాది కందుకావతిమీఁద.

ఈహడావడిలో కాలేజిరోజులు దాఁటి పోయెను. అతఁ డింటికడనే ఉండవలసివచ్చెను. ఇది యొక ముప్పు.

పదివేలు అప్పు. చేతిలో తగినంత ద్రవ్య ములేదు. వెలిఖాయపడియుండుచో దేవాదా యముకూడ రాదు. ఇది యొకసంకటము.

'నగలు చేయించి కందుకావతి కిచ్చితిని. అవియే యుండుచో ఒకదెబ్బన పెండ్లి కాకుం డునా ?' అని ఆచార్లు చింతించుచుండెను. తల్లి—'ఏమినాయనా! పిల్లను విచారించిరా నా ? అనెను. 'ఏమిపెట్టి విచారింతువు?' అని కొడుకనఁగా పెట్టెలోనుండి నగలమూట తెచ్చి 'ఇదిగో! ఆనాఁడు నీవు పెండ్లికూఁతు నకుఁగాను చేయించి నా కిమ్మని ఎవరిచేతనో పంపిన నగలమూట! ఈనగలుపెట్టి విచారింతు' నని తల్లియనెను.

ఆచార్లు నగలు చూచెను. 'అమ్మా! నీ కిచ్చిన దెవరు ?'

'ఎవరో చీఁకటిలో; నీవు కాదు నాయనా పంపినది?'

ఆచార్లు నిర్విణ్ణుఁడు. మాటలేదు; పలుకు లేదు. తెలిసినమూర్ఛ.

'నీవుకాదా? పంపినది?'

'ఔను.'

'ఇంకేమి.'

తిరునాంచారమ్మ ఆనగలతో నంబూరు తిరుమలమ్మకడకు వెళ్లెను.

తిరుమలమ్మకు ఆ నగనుట్రా అంతయు పాముమీఁదిరత్నము. అయినను బంగార ము. కాని సంఘములో వెలి. అయినను వరుఁడు అదృష్టలభ్యుఁడు. కాని లోకనింద. అయిన నేమి? పిల్లకు స్వర్గసుఖము.

తుదకు తిరుమలమ్మ యిటు లనెను. ఈనగలు ఇపుడు వలదు. పెండ్లికాలమున పెట్ట వచ్చును. పెద్దలను కనుఁగొని అంగీకారమును కొలఁదిరోజులలో తెలిపెదను.

తిరునాంచారమ్మ ఆనగలను మరల చింత వలె మూటకట్టుకొనెను. సంగతు లన్నిటిని కుమారునికి తెలిపెను.

నరసింహుల చావు అతనిని బాధింప లేదు. తనకు బదులుగా కందుకావతి గాయము చెందుట బాధింపలేదు. తనను తప్పించి కందు కావతి చెఱఁబడుట బాధింపలేదు. వెలి అతనిని బాధించెను. కందుకావతి నగలను తనతల్లి కిచ్చుట బాధించెను. తిరుమలమ్మ నగలను తిప్పి పంపుట అతనిని బాధించెను. దీనికి కార ణము కందుకావతియే.

దినములు గతించెను; మాసములు గతిం చెను. తిరుమలమ్మ కడనుండి అంగీకారము లేదు. తిరుమలమ్మకూఁతుపెండ్లి అయిపోయెను. అయినట్లు కొన్నాళ్లకు నంబూరినుండి వచ్చిన వాఁ డొకఁడు చెప్పెను.

ఆచార్ల కిపుడు కందుకావతి యంద ము వికారమాయెను. దానిమాటలు మాయ మాటలు; చేతలు కత్తికోఁతలు. లోఁగడ

6 4 7- ౫౦౫

కొన్నివిషయములలో తనను రక్షించుట ఎపుడో తనను భక్షించుటకే. నగ లిడుట తన్నినడించుటకుఁగాక వేఱేమి?

అతని కుపశాంతి లేకపోయెను. కేవల మందులకే కాలేజిలోఁ జేరెను.

౭

తిరునాంచారమ్మ ఒకనాఁడు పక్కలోది పక్కలో ప్రాణములు విడిచెను. ఆఱ్ఱముగ్గిన పండు ఆర్భాటము లేకయే రాలును.

రాయి కలకత్తానుండి వచ్చెను. ఏకర్మయు చేయలేదు. భద్రాద్రిరాముని సేవింపలేదు. పరీక్ష ఓడెనో గెలిచెనో తెలిసికొన వ్రాఁచి అతని కున్నటులు కానిపింపలేదు. కాని లోకులకు లేకపోలేదు.

అతఁడు తప్పినటులు టెన్నిసు-సహచరులకు తెలిసెను. పట్టిక అతనిసంఖ్య లేనిచోట నల్లగీటుఁతో గోడమీఁదనుండి వసారాలో పడుకొనిన ఆచార్లమీఁద పడెను. అతఁ డులికిపడి లేచి చూచెను. వాకిటికి పరువిడి తలుపులు తెఱచి దారి కటూ ఇటూ చూచెను; శూన్యము.

తలుపులుమూసి తిరిగి వచ్చి కాకితమును, నల్లగీటును చూచెను. తన నెంబరు లేదు. ఒక్కనిట్టూర్పు పుచ్చెను. ఆనిట్టూర్పుతో కాకితము అరుఁగుకిందికి పోయెను.

పరీక్ష పోయినందులకు అతఁడు మరియొక నిట్టూర్పు విడువలేదు.

అతఁ డూరక ఆకాశమును జూచుచుబరుండెను. ఒకమబ్బు వచ్చుచుండెను; ఒకమబ్బు పోవుచుండెను. కానిపించుచున్న నక్షత్రములు మఱునిముసమున కానిపించుటలేదు. చంద్రుఁడంతవాఁడుకూడ మబ్బుచే మాయమగుచుండెను. తెల్లనిచోట నలుపు; నల్లనిచోట తెలుపు. అతనిమదిలో ఏపరివర్తనమును లేదు.

అతనికి ఒకమేఘము రాటమువలె కనఁబడెను. అదియే మగ్గముగా మాఱెను. అదియే కందుకావతి యాయెను. మబ్బు విఱిగెను.

టెన్నిసు-బంతి పోవుటయు, తాను రంగనాయికయింటికి వెళ్లుటయు, అది బంతి దాఁచుటయు, తాను తీయుటయు, అది వెనుక వెనుక కొదుగుటయు, తాను ముద్దిడుటయు స్మృతికి వచ్చెను. 'ఆహా! కందుకావతీ' యని తలఁచుకొనెను.

పిదప, తాను నగలు కాను కిచ్చుటయు, అది తిరుగఁగొట్టుటయు, నరసింహులు తనను జంపవచ్చుటయు, వానిచావును, తనకు పదివేలు వదులుటయు, వెలియు, తాను పెండ్లాడ యత్నించుటయు, దరిద్రపు తిరుమలమ్మపిల్ల నీకుండుటయు స్మృతికి దగిలెను. ఒక చింతాసముద్రము. అతఁడూఁపిరియాడక కొట్టుకొనుచుండెను.

కవాటముపై అంగుళిధ్వని. ఆచార్లు చమకితుఁ డాయెను. 'ఇపుడు తనయింటికిమృత్యువు తక్క మరి యెవరు రారే! వెన్నెలయైనను నడిరేయి. టెన్నిసు వారేమో? ఐనను— ఎవరు?'

మరల అంగుళిధ్వని.

ఆచార్లు తలుపుతీసెను. తెలతెలఁబోయి వెనుక వెనుకకుఁ బోయెను. లోలోపలఁ 'అపుడే ఏల వదలిరి ?' అనుకొనెను.

కందుకావతి లోనికి వచ్చి తలుపులు మూసెను.

'నీవు లోనికి రాఁగూడదు. తలుపులు మూయకు, బయటికి పొమ్ము.'

'వెళ్లుటకే వచ్చితిని. తలుపులు నాకొఱకు మూయలేదు నీకొఱకు.'

ఆచార్లు రిచ్చవడి అరుఁగుపై కూర్చుండెను. కందుకావతి సమీపించి 'ఓయీ! నీవు నేఁడు పరుండవలయును. పరుండఁగా నిన్ను నేను చూడవలయును' అనెను.

'చాలా సారులు చూచితివి.'

'మరల నేఁడు చూడవలయును.'

ఆచార్లు— 'చూడుము అని పరుండెను.'

రంగనాయిక పదతలములకడకు వచ్చి- 'ఇదిగో నీబంతి! ఇఁక నీబంతితో ఆడుకొనుము.'

'పడవేయుము!'

రంగనాయిక బంతిని మెల్లగా పక్కలో పడవైచి పాదములు ముట్టి వెళ్లిపోయెను. ఆచార్లు వెనువెంటనే వచ్చి తలుపులు మూసికొనెను. రంగనాయిక చప్పుడు కాకుండ బయట గొళ్లెముపెట్టి వెళ్లిపోయెను. ఆచార్లు పడుకొని ఆకాశము చూచుచు—'ఇపుడిది యేమి చేయును?' అని యాలోచించెను. గబగబ తలుపులు తెఱవఁజూచెను. రాలేదు. గోడదుమికి కందుకావతియింటికి వెళ్లెను. తలుపునకుబయట గొళ్లెము. లోపలికేఁగెను శిథిల గృహమున శూన్యదేవత రాణివాసముండెను.

ఇంటిప్రక్క నున్న కాలువయెక్కి— 'ఎవ రా మునగానాం తేలానామ్?' అనెను.

అతఁడు నీటిలో దిగి కేవలభారమైన కేశభారమును ఒడ్డునకుఁ జేర్చెను. లావణ్యప్రవాహము ప్రవాహమునఁ గొట్టుకొనిపోయెను.

రంగనాథుఁడు కొంచెము సేపు చూచి చూచి కేశభారమును కత్తిరించి తీసికొనెను. భారహీనమైన ఆపదార్థమును నడికాలువలోనికి త్రోసివైచెను, ఆశరీరము నదిలో కొట్టుకొనిపోయెను.

అతఁడు కట్టపై కొంతద వ్వరిగి యరిగి— నాకు 'అపుడా వెలి ? లేక యిపుడా ?' అనుకొనెను. సందేహము మాత్రము విడలేదు.